RNI-TELTEL/2017/72695

శుభ

# తెలంగాణ

1 నవంబర్ 2022

సోమవారం| మేడ్చల్

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

సంపుటి : 5, సంచిక :243

వెల: 4 రూ/.

Website:
www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను....

శుభ తెలంగాణ దిన పత్రిక లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన

ఫోన్ నెంబర్.8142325167

## కేసీఆర్...
## నాపై ఆరోపణలకు ఆధారాలు ఉంటే చూపించు



- రూ.18 వేల కోట్ల కాంట్రాక్టుల కోసమేనన్న టీఆర్ఎస్
- 36 ఏళ్లుగా తాము వ్యాపారాలు చేస్తున్నామన్న కోమటిరెడ్డి
- కంపెనీ వ్యవహారాలు కొడుకు చూసుకుంటున్నాడని వెల్లడి

**హైదరాబాద్ శుభ తెలంగాణ):** కాంగ్రెస్ ను వీడి బీజేపీలో చేరిన తాను రూ.18 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్టు పనుల కోసమే బీజేపీలో చేరానంటూ టీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై మునుగోడు బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. "కేసీఆర్... నాపై ఆరోపణలకు ఆధారాలు ఉంటే చూపించు" అంటూ సవాల్ విసిరారు.

తన కుటుంబం 36 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉందని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఇప్పుడు తన కుమారుడు కంపెనీ వ్యవహారాలు చూసుకుంటున్నాడని వివరించారు. కోల్ ఇండియా సంస్థలో తమ కంపెనీకి ఓ గ్లోబల్ కాంపిటీటివ్ టెండరు దక్కితే, దాన్ని వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

ఈ వ్యవహారానికి రాజకీయ రంగు పులిమారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను తప్పు చేశాననేందుకు వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు' అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ కేసీఆర్ నామినేషన్ పద్ధతిలో ఎన్నో కాంట్రాక్టులను ధారదత్తం చేయడంలేదా? అని నిలదీశారు.

కాగా, మునుగోడు

వివరాలు 2లో..

## రాజీనామా చేయాలంటూ
## ఎమ్మెల్యేలపై ఓటర్ల ఒత్తిడి




**హైదరాబాద్ శుభ తెలంగాణ:**మెదక్ మునుగోడు ఉప ఎన్నికతో రాష్ట్రంలో ఎమ్మెల్యేల రాజీనామాలపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. కొంతమంది ఓటర్లు తమ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు ఫోన్ చేసి రాజీనామా చేయాలని కోరుతున్నారు. రాజీనామా చేస్తేనే తమ నియోజకవర్గంతో పాటు తమ గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని డిమాండ్ చేస్తున్నారు. వారం రోజుల్లోనే ఏకంగా ఆరుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసిన ఓటర్లు.. రాజీనామాలు చేయాలంటూ ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేశారు.

మొన్న మెదక్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, నిన్న నర్సాపూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జహీరాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్ రావు, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, అందోల్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఇవాళ జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి.. తమ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తల నుంచి రాజీనామాలు చేయాలంటూ ఫోన్లు వచ్చాయి.

**ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి ఫోన్**

జనగాం టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి ఫోన్ చేసిన ఓ వ్యక్తి రాజీనామా చేయాలని కోరాడు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే..మునుగోడు నియోజకవర్గం తరహాలో తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరగా జరుగుతాయని చెప్పాడు. ప్రజలు, కార్యకర్తల

వివరాలు 2లో..

## టీఆర్ఎస్?తో పొత్తు ఉండదు



**హైదరాబాద్ శుభ తెలంగాణ):** దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. బీజేపీ, టీఆర్ఎస్?లు కలిసి ఒకరిద్దరికే కాంట్రాక్టులు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. అందుకే యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆయన చెప్పారు. భారత్ జోడో యాత్ర కొత్తూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిట్నెస్ కోసం అయితే జిమ్ చేస్తే సరిపోతుంది.. పాదయాత్ర చేయాల్సిన పనిలేదన్నారు. దేశ మనుగడ కోసం భారత్ జోడో యాత్ర చేస్తున్నామని అన్నారు. రాజకీయం, ఎన్నికల కోసం యాత్ర చేయడం లేదన్న ఆయన.. ప్రజల మధ్య సోదర భావం

వివరాలు 2లో..

# నీళ్లిచ్చే కేసీఆరా?
# కన్నీళ్లు పెట్టిచ్చే మోదీనా?

- మునుగోడు ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి
- గ్యాస్‌బండకు దండం పెట్టి పోలింగ్‌కు వెళ్లండి
- అమిత్ షా చెప్పినట్టే ఎమ్మెల్యేలతో బేరసారాలు
- ప్రధాని మోదీ ఇలాకాలో చేనేత ఆత్మహత్యలు
- బీజేపీ గెలిస్తే చేనేతపై జీఎస్టీ మరింత పెరుగుతుంది
- ధరణి పోర్టల్ ఓ వరం.. దానిపై అపోహలొద్దు
- కాంగ్రెస్‌తో పొత్తుపై రాహుల్‌గాంధీని ఎవరడిగారు?
- టీ న్యూస్ ఇంటర్వ్యూలో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్ శుభ తెలంగాణ ):**నీళ్లిచ్చే కేసీఆర్ కావాల్నా? కన్నీళ్లు పెట్టిచ్చే మోదీ కావాల్నా? మునుగోడు ప్రజలు ఆలోచించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. బీజేపీకి ఓటేస్తే.. వ్యవసాయ మోటర్లకు మీటర్లు వస్తాయని, కరెంట్ కంపెనీలను ప్రైవేటుపరం చేస్తారని చెప్పారు. మునుగోడులో పోలింగ్ బూత్‌కు వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ గ్యాస్ బండకు దండం పెట్టి వెళ్లాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు బీజేపీ తులం బంగారం ఇచ్చేందుకు సిద్ధపడినట్టు తెలిసిందని.. ఇస్తే అక్కాచెల్లెళ్లు తీసుకోవాలని, ఓటు మాత్రం కేసీఆర్‌కు, కారు గుర్తుకే వేయాలని కోరారు. ఎమ్మెల్యేల కొనుగోలు.. అమిత్ షా చెప్పినట్టే జరుగుతున్నదని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికలో రాజగోపాల్‌రెడ్డిని గెలిపిస్తే నెలరోజుల్లో ప్రభుత్వాన్ని కూలుస్తామని అమిత్ షా చెప్పారని.. ఇప్పుడదే జరుగుతున్నదని తెలిపారు. చివరికి ఉద్యోగులను సైతం అవమానిస్తున్నారని, ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని అన్నారు. మోదీ ఇలాఖాలో నేటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తెలిపారు. టీ న్యూస్‌కు కేటీఆర్ ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే

**ప్రతి ఎన్నిక మాకు ప్రతిష్ఠాత్మకమే..**



రాష్ట్రంలో అధికార పార్టీగా.. ఇక్కడ జరిగే ఏ ఎన్నికైనా మాకు ప్రతిష్ఠాత్మకమే. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అమిత్ షా సహా అనేక మంది కేంద్ర మంత్రులు వచ్చారు.

వివరాలు 2లో..

## తెలంగాణ మంత్రి జగదీశ్ రెడ్డి
## పీఏ ఇంటిలో ఐటీ సోదాలు

**మునుగోడు ఉప ఎన్నికల కీలక బాధ్యతల్లో జగదీశ్ రెడ్డి**

**ఇటీవలే జగదీశ్ రెడ్డికి నోటీసులు జారీ చేసిన ఈసీ**

**నల్లగొండలోని జగదీశ్ రెడ్డి పీఏ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై ఐటీ దాడులు**

**భారీ ఎత్తున నగదు పట్టుబడినట్టుగా ప్రచారం**



**హైదరాబాద్ శుభ తెలంగాణ ):**మునుగోడు ఉప ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకున్న వేళ సోమవారం రాత్రి తెలంగాణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ మంత్రి గండకుంట్ల జగదీశ్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ప్రభాకర్ రెడ్డి ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. నల్లగొండలోని ప్రభాకర్ రెడ్డి ఇంటికి చేరుకున్న ఐటీ అధికారుల బృందం ఆయన ఇంటిలో సోదాలు చేస్తున్నారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను టీఆర్ఎస్ అధినాయకత్వం జగదీశ్ రెడ్డికి అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మునుగోడు ఉప ఎన్నికల ప్రచారాన్ని మొత్తం తన భుజాలపై వేసుకున్న జగదీశ్ రెడ్డి అలుపెరగకుండా ప్రచారంలో సాగుతున్నారు. రెండు రోజుల క్రితం ఎన్నికల నిబంధనలను జగదీశ్ రెడ్డి అతిక్రమించారంటూ కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని మరువక ముందే ఆయన పీఏ ఇంటిపై ఐటీ అధికారులు దాడులు చేయడం గమనార్హం.


## మోర్బీ ఘటన పై మోడీ హైలెవల్ మీటింగ్



**హైదరాబాద్ శుభ తెలంగాణ ):** ప్రస్తుతం గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ... మోర్బీ ఘటన పై ఆ రాష్ట్ర మంత్రులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. గాంధీనగర్ లోని రాజ్?భవన్?లో జరిగిన ఈ సమావేశానికి సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ, చీఫ్ సెక్రటరీ, డీజీపీ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను అధికారులు మోడీకి వివరించారు. బాధితులను అన్నిరకాలుగా ఆదుకోవాలని మోడీ వారికి సూచించారు.

**రేపు ఘటనాస్థలానికి ప్రధాని మోడీ**

కేబుల్ బ్రిడ్జి కూలిన ఘటనపై ఇప్పటికే దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ రేపు ఘటనాస్థలాన్ని సందర్శించనున్నారు. ఈ విషయాన్ని గుజరాత్ సీఎంవో కార్యాలయం వెల్లడించింది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ 50,000 చొప్పున మోడీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అటు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షలు, గాయపడిన వారికి రూ 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. వంతెన కూలిన ఘటనపై విచారణ జరిపేందుకు గుజరాత్ ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.




వివరాలు 2లో..

## మోటర్లకు మీటర్లు ముమ్మాటికీ నిజం

- ఇవిగో రాష్ట్రానికి కేంద్రం రాసిన లేఖలు
- మీడియాకు చూపిన మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణలో మీటర్లు పెట్టే ప్రసక్తే లేదు
- రైతులకోసం 30వేల కోట్లు వదులుకొన్నం
- సీఎం కేసీఆర్ సభతో బీజేపీ మైండ్ బ్లాంక్
- మీడియా సమావేశంలో మంత్రి వ్యాఖ్యలు

వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం రాష్ట్రానికి చెప్పిన మాట పచ్చి నిజమని వైద్యారోగ్య, ఆర్థికశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. మోటర్లకు మీటర్లు పెడితే రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల వరకు ఎఫ్ఆర్‌బీఎం కింద అనుమతిస్తామని ఎర చూపిందని పేర్కొన్నారు. కానీ, రాష్ట్ర రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టకూడదని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకొన్నారని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం తమ ప్రభుత్వ నిర్ణయాలపైన

## షర్మిల ప్రసంగాన్ని అడ్డుకునేందుకు టీఆర్ఎస్ కార్యకర్తల యత్నం



**హైదరాబాద్ శుభ తెలంగాణ )** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం భీమారం మండల కేంద్రంలో అధ్యక్షురాలు షర్మిల స్థానికులతో నిర్వహించిన 'మాట – ముచ్చట' కార్యక్రమం రసాభాసాగా మారింది. షర్మిల ప్రసంగాన్ని అడ్డుకునేందుకు టీఆర్ఎస్ కార్యకర్తలు యత్నించారు. వెంటనే స్పందించిన కార్యకర్తలు, టీఆర్ఎస్ కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని గమనించిన పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువురిని శాంతింపజేశారు. కారు పార్టీ కార్యకర్తల ఓవరాక్షన్ పై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాలు మాట్లాడితే ఇలానే అడ్డుకోవాలని చూస్తారని ఆరోపించారు. టీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందితే సరిపోతుందా అంటూ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బంగారు తెలంగాణ అని చెప్పి అప్పుల తెలంగాణగా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు చెప్పి రూ.70 వేల కోట్లు మింగేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారని మండిపడ్డారు. గల్ఫ్ బాధితులకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని మర్చిపోయిందన్నారు. ఈ నియోజక వర్గంలో గల్ఫ్ బాధితులు ఎక్కువగా ఉన్నారని..వారి కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి తెలంగాణ సర్కారు మర్చిపోయిందని తెలిపారు

## నేటితో మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం పూర్తి

- ఈ నెల 3న పోలింగ్..
- రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్
- తనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టీకరణ

**హైదరాబాద్ శుభ తెలంగాణ )** మునుగోడు ఉప ఎన్నిక కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. మంగళవారం

వివరాలు 2లో..

## 'బండి' బూతులపై భగ్గుమన్న ఉద్యోగులు

- సంజయ్ తీరుపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల జేఏసీ ర్యాలీ
- అనుచిత వ్యాఖ్యలతో ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీశారు: జేఏసీ నేతలు
- బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్

వివరాలు 2లో..

# నీళ్లిచ్చే కేసీఆరా? కన్నీళ్లు పెట్టిచ్చే మోదీనా?

-మొదటిపేజీ తరువాయి

'మున్సిపల్ ఎన్నికలకే అంతమంది వచ్చినప్పుడు.. మా రాష్ట్రంలో, మేం అభివృద్ధి చేసిన చోట, మేం చేసిన పనిని చెప్పుకోవడానికి, పాజిటివ్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి టీఆర్ఎస్ కార్యకర్తలుగా ఎమ్మెల్యేలు మునుగోడుకు వెళ్లడంలో తప్పేముంది? బీజేపీని అడ్డుకొనేందుకే సర్వశక్తులు ఒడ్డుతున్నాం.

**దున్నపోతుకు సున్నం పూస్తే ఎద్దు కాదు..**

రాజగోపాల్‌రెడ్డి గత నాలుగేండ్లలో మునుగోడుకు తిరిగి వెళ్లింది లేదు. 159 పంచాయతీలు ఉంటే దాదాపు 125 గ్రామాలకు ఆయన వెళ్లనే లేదు. అందుకే ఇప్పుడు ప్రచారం కోసం వెళ్తే ప్రజలు ఛీత్కరిస్తున్నారు. ఎమ్మెల్యేలు పట్టించుకుంటే నాలాంటివారు నియోజకవర్గాన్ని దత్తత తీసుకొనే అవసరం రాదు. రాజగోపాల్‌రెడ్డి పట్టించుకోకపోయినా నియోజకవర్గంలో ఎక్కడా పనులు ఆగలేదు. మిషన్ భగీరథ, కాకతీయ, పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ ఇలాంటివేవీ ఆగలేదు. రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాలపై ఆయన పంచాయతీ శాఖ మంత్రికిగానీ, మున్సిపల్ మంత్రినైన నాకుగానీ ఒక్క వినతిపత్రం కూడా ఇవ్వలేదు. దీంతో అవి పరిష్కారం కాలేదు. అయినా.. కాంట్రాక్టర్‌ను, డబ్బు విసిరికొట్టి మునుగోడు ప్రజలను కొంటాను అనే అహంకారం రాజగోపాల్‌రెడ్డిలో ఉన్నది. 'దున్నపోతుకు సున్నం పూస్తే ఎద్దు కాదు.. కాంట్రాక్టర్‌కు కలర్ వేస్తే రాజకీయ నాయకుడు కాదు' అని ప్రజలు గుర్తించాలి. రాజగోపాల్‌రెడ్డికి చెందిన సుశీ ఇన్‌ఫ్రా నుంచి డబ్బులు పంపిణీ చేస్తే.. అది తన కొడుకు కంపెనీ అని, తనకు సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదం. ప్రజలు ఈ ఝూటా మాటలను నమ్మరు.

**బీజేపీకి ఓటేస్తే జీఎస్టీ పెరుగుతుంది**

చేనేతపై జీఎస్టీలో 2.5 శాతం రాష్ట్రానికి వస్తుంది.. బీజేపీ అధికారంలోకి వస్తే దానిని తిరిగి ఇస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ ఎలా ఇస్తారు? కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీయే కదా.. మొత్తం 5 శాతం రద్దు చేయొచ్చు కదా? బీజేపీకి ఓటేస్తే చేనేతపై జీఎస్టీని ఒప్పుకున్నట్టే అవుతుంది. మునుగోడులో బీజేపీ గెలిస్తే 5 శాతంగా ఉన్న జీఎస్టీ 12 శాతానికి, 18 శాతానికి పెరుగొచ్చు. బీజేపీకి బుద్ధి చెప్పాలంటే ఓటు ఒకటే మార్గం. మునుగోడులోని నేతన్నలు ఒక్క ఓటు కూడా బీజేపీకి వేయొద్దు. వారి డిపాజిట్ గల్లంతు కావాలి. అప్పుడే మోదీ దిగివచ్చి జీఎస్టీని రద్దు చేస్తారు. మోదీ ప్రభుత్వం మరో ఏడాది మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పడుతుంది. అందులో బీఆర్ఎస్ కీలకపాత్ర పోషిస్తుంది. అప్పుడు చేనేతపై జీఎస్టీని రద్దు చేస్తాం. డబుల్ ఇంజిన్ సర్కారని చెప్పుకునే రాష్ట్రాల్లో చేనేత ఆత్మహత్యలు పెరుగుతున్నయి. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో రెండేండ్లలో 50 మంది చేనేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకున్నరు. వీళ్లు చేనేత కార్మికుల సంక్షేమం, తెలంగాణ పరిపాలన గురించి మాట్లాడడం హాస్యాస్పదం. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లో ఫ్లోరోసిస్ భూతం పట్టి పీడిస్తున్నది. కానీ తెలంగాణలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినం.

**బీజేపీకి ఓటేస్తే పొంచి ఉన్న ప్రమాదాలు**

మునుగోడులో బీజేపీకి ఓటేస్తే ప్రమాదాలు పొంచి ఉన్నయి. మొదటిది వ్యవసాయ మోటర్లకు మీటర్లు వస్తయి. ప్రతి గంట గంటకూ లెక్కగట్టి కరెంట్ ఇస్తరు. వాళ్లు చెప్పిన రేటుకే కరెంట్ కొనుక్కోవాలి. రెండోది.. కరెంట్ కంపెనీలను ప్రైవేటుపరం చేస్తరు. పెట్రోల్ బంకుల్లాగే కరెంట్ బంక్‌లు వస్తయి. మొబైల్ రీచార్జిలాగే ఎప్పటికప్పుడు కరెంట్ రీచార్జి చేసుకోవాల్సి వస్తది. ఇప్పుడు కేంద్రం ఏమంటున్నా తెలంగాణలో రైతులకు న్యాయం చేస్తున్నం. కేంద్రం ధాన్యం కొనబోమని చెప్పినా.. మనం కొంటున్నం. కానీ రేపు బీజేపీ అధికారంలోకి వస్తే పరిస్థితి తారుమారైతది. కల్లాల దగ్గర కాంటా ఉండదు. ధాన్యం సేకరణ బంద్ అయితది. అంబానీలు, అదానీలు పెద్దపెద్ద వాళ్లు బయటికి వస్తరు. మీ కల్లాల్లోకి వాళ్లు వచ్చి తిష్టవేస్తరు. వాళ్లు చెప్పిన రేటుకే మీరు పంటను అమ్మాలి. కనీస మద్దతు ధర ఉండదు. కార్పొరేట్ శక్తులను రాష్ట్ర ప్రభుత్వాలే అడ్డుకోలేక పోతున్నాయి. ఇక రైతులు ఎలా అడ్డుకుంటారు? తెలంగాణపై కేంద్రం అన్నింట్లో వివక్ష చూపుతున్నది. చివరికి విద్యా సంస్థల విషయంలోనే అన్యాయమే చేసినది. కేంద్రం లెక్కప్రకారం ప్రతిజిల్లా కేంద్రంలో ఒక నవోదయను ఏర్పాటు చేయాలి. అంటే తెలంగాణలో 33 నవోదయ విద్యాలయాలు ఉండాలి. కానీ ఎన్నిసార్లు విన్నవించినా చేయలేదు. సంస్థాన్ నారాయణపూర్‌లో డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేస్తాం. నారాయణపేటలో కూడా తప్పకుండా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తాం.

**మోదీని ఓటుతో దండించండి**

ప్రజల్లో నిరాసక్తత పెరిగిపోతున్నది. ఒకప్పుడు ఉల్లిగడ్డ ధర పెరిగితేనే ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత భారతదేశానిది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎందుకింత నిరాసక్తత పెరిగిపోతున్నదో నాకైతే అర్థం కావడం లేదు. గ్యాస్ ధరలు పెరిగినా, పెట్రోల్ ధరలు పెరిగినా ప్రజల్లో స్పందన రావడం లేదు. ప్రపంచంలోనే అత్యధికంగా సిలిండర్ ధర భారతదేశంలోనే ఉన్నది. ముడి చమురు ధర పెరగకపోయినా.. మోదీ చమురు ధర మాత్రం పెరిగింది. ఆర్టీసీ చార్జీలు ఎందుకు పెంచినరని కొందరు అడుగుతున్నరు. పెట్రో ధరలు పెరిగితే ఆర్టీసీ చార్జీలు పెరుగుతయా? లేదా? చార్జీలే కాదు.. ఉప్పు, పప్పు.. ఇలా అన్ని ధరలు పెరుగతూనే ఉంటాయి. ముందు గ్యాస్ సిలిండర్‌కు దండం పెట్టి వెళ్లండి. ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తున్న బీజేపీని ఓటుతో దండించండి.

**ధరణిపై అపోహలు నమ్మొద్దు**

తెలంగాణలో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నరు. గతంలో వాళ్లను రెవెన్యూ వ్యవస్థ పీడించేది. ఇది అందరికీ తెలిసిన నిజం. పరపతి, పలుకుబడి ఉన్నోడు నచ్చినట్టు చేసుకునేటోడు. ఇవన్నీ ఆలోచించే.. వాళ్లందరికీ మేలు చేసేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణిని తీసుకొచ్చారు. ఒకేరోజు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయిపోతున్నది. ఇదో గొప్ప సంస్కరణ. అయితే.. కొత్తగా ఏది తీసుకొచ్చినా బాలారిష్టాలు ఉంటాయి. అవన్నీ కామన్. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చెప్పొచ్చు. తప్పకుండా మార్పులు, చేర్పులు చేస్తాం. దీనికోసం క్యాబినెట్ సబ్ కమిటీ పనిచేస్తున్నది.

**యాదాద్రికి రూపాయి ఇచ్చారా?**

హిందూయిజం పేరుతో పబ్బం గడుపుకొనే బీజేపీ తెలంగాణలో ఏ గుడికైనా ఒక్క రూపాయి ఇచ్చిందా? బండి సంజయ్ ప్రమాణం చేసిన యాదాద్రికి 100 రూపాయలైనా ఇచ్చారా? ఎమ్మెల్యే కొనుగోలుకు వచ్చినోళ్లే చెప్తున్నరు కదా బీఎల్ సంతోష్, అమిత్ షా పేర్లు. తమ పాత్ర లేదని వాళ్లిద్దరినీ యాదాద్రి దేవాలయానికి వచ్చి ప్రమాణం చేయమని చెప్పండి. బండి సంజయ్‌ని కరీంనగర్ ఎంపీగా గెలిపించింది ఎందుకు? మసీదులు తవ్వుదాం.. అక్కడ శవం ఎల్లితే మీది.. శివ లింగం ఎల్లితే మాది అని చెప్పేటందుకా? శవాలు తవ్వేందుకేనా ఎంపీగా గెలిపించింది. నిజాం పేరు చెప్పకుండా? ఇస్లాం పేరు చెప్పకుండా? బీజేపీకి ఓటడిగే దమ్ముందా? మసీదులు తవ్వేటోళ్లు కావాల్నా? పంటలకు కాల్వలు తవ్వేటోళ్లు కావాల్నా? అనేది మునుగోడు ప్రజలే ఆలోచించుకోవాలి.

**ఓటుకు తులం బంగారం?**

మునుగోడులో గెలిచేందుకు బీజేపీ అన్ని కుట్రలు చేస్తున్నది. బలం లేకనే కేంద్రం నుంచి బలగాలను దింపుతున్నరు. ఒక ఉపఎన్నికకు 16 వేలమంది సెంట్రల్ ఫోర్సు అవసరమా? ఇక ఓటును పైసలిచ్చి, ప్రలోభపెట్టి కొనేందుకు చూస్తున్నరు. ఒక్కో ఓటుకు తులం బంగారం ఇచ్చేందుకు బీజేపీ సిద్ధపడినట్టు తెలిసింది. అక్కచెల్లెళ్లకు నేను చెప్పేది ఒక్కటే.. బంగారమిస్తే తీసుకోండి. పైసలిస్తే తీసుకోండి. కానీ ఓటు మాత్రం కేసీఆర్‌కు, కారు గుర్తుకే వేసి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి.

**ఆ పార్టీతో పొత్తు ఎవరి అడిగారు**

%టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోబోమని రాహుల్ గాంధీ చెప్పడమే విచిత్రం. ఆయనతో పొత్తును ఎవరు అడిగారు. అసలు ఆయన పార్టీ ఎక్కడ ఉంది. ఆయన భ్రమల్లో ఉండి మాట్లాడుతున్నారు. హుజూరాబాద్‌లో 3వేల ఓట్లు తెచ్చుకున్న పార్టీతో ఎవరు పొత్తు పెట్టుకుంటరు? కాంగ్రెస్‌తో పొత్తు కోసం ఇక్కడ ఎవరూ వెంపర్లాడడం లేదు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కాదు.. కాంగ్రెస్ జోడో యాత్ర చేయాలి. అసలు బీజేపీ విషయంలో కాంగ్రెస్ నీతి ఏంటి? మేమేమో ఇక్కడ బీజేపీతో అమితుమీ పోట్లాడుతున్నం. కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉంటున్నది. ఎన్నికలున్నటువంటి, ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో రాహుల్ పాదయాత్ర ఎందుకు చేయడం లేదు. ఇద్దరి మధ్య గల రహస్య ఒప్పందం ఏమిటి?

**బ్రహ్మాస్త్రం కేసీఆర్**

రాష్ట్రంలో మోదీ విసిరిన బాణాలు అనేకం తిరుగుతున్నయి. కానీ ఆ బాణాలకు తెలియంది ఏమిటంటే.. మా వద్ద బ్రహ్మాస్త్రం ఉన్నదని. తెలంగాణ ప్రజల చేతిలో కేసీఆర్ అనే బ్రహ్మాస్త్రం ఉన్నది. ఆయన ఉన్నంత వరకు తెలంగాణను ఎవరూ ఏమీ చేయలేరు. మేం ముందే చెప్పినం.. మా దారిలో వచ్చే వారితో కలిసి పనిచేస్తామని. ఇప్పుడు కమ్యూనిస్టులు మా దారిలోకి వచ్చారు. అదేవిధంగా దేశంలో కొనసాగుతున్న నరేంద్రమోదీ అనే దుర్మార్గ వ్యక్తి పాలనకు చరమగీతం పాడాలంటే, ఆయన్ను ఎదుర్కోవడానికి కలిసి పని చేస్తున్నాం. ఇది భవిష్యత్తులోనూ కొనసాగుతుంది

# రాజీనామా చేయాలంటూ ఎమ్మెల్యేలపై ఓటర్ల ఒత్తిడి

-మొదటిపేజీ తరువాయి

నుంచి తరచూ ఫోన్లు వస్తుండడంతో కొంతమంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో పాటు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది ఎమ్మెల్యేలు తమకు ఫోన్లు చేసిన వారిని అనుచరులతో బెదిరిస్తున్నారు.

**బోథ్ ఎమ్మెల్యే రాజీనామా చేయాలంటూ రాస్తారోకో**

బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రాజీనామా చేస్తేనే రోడ్డు వేస్తారని ఆదిలాబాద్? జిల్లా భీంపూర్ మండలానికి చెందిన ఆరు గ్రామాల ప్రజలు ఆదివారం నిపాని గ్రామం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిరసన చేపట్టారు. జందాపూర్ నుంచి కరంజీ వరకు 46 కిలోమీటర్ల దూరం ఉంటుందని, 33 కిలోమీటర్ల రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఎమ్మెల్యే రాజీనామా చేస్తేనే రోడ్డు బాగు పడుతుందన్నారు.

**జహీరాబాద్ ఎమ్మెల్యే రాజీనామాకు డిమాండ్**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావుకు మనియార్ పల్లి గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ అక్రమ్ షా ఆదివారం ఫోన్ చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని కోరాడు. రాజీనామా చేస్తే మునుగోడు నియోజకవర్గం తరహాలో తమకు లబ్ధి చేకూరుతుందని విజ్ఞప్తి చేశాడు. సీఎం కేసీఆర్ ను అడిగి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే మాణిక్ రావు అక్రమ్ షాకు సర్దిచెప్పారు ఎమ్మెల్యే మాణిక్ రావు.

**రాజీనామా చేయాలంటూ అందోల్ ఎమ్మెల్యేపై ఒత్తిడి**

అందోల్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కు అల్లాదుర్గం మండలం మాందాపూర్ గ్రామం నుంచి కృష్ణ అనే వ్యక్తి ఫోన్ చేసి రాజీనామా కోరాడు. ఇప్పటికే తన నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులు చేపట్టానని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్.. సదరు వ్యక్తికి నచ్చజెప్పాడు.

**రాజీనామా కోరిన వ్యక్తిపై ఫిర్యాదు**

నర్సాపూర్?ఎమ్మెల్యే మదన్ రెడ్డికి శనివారం ఫోన్? చేసి పదవికి రాజీనామా చేయాలని కోరిన బీజేపీ శివ్వపేట మండలం ఉసిరికపల్లి ప్రధాన కార్యదర్శి అశోక్?పై టీఆర్ఎస్? నాయకులు ఆదివారం పోలీస్?స్టేషన్?లో ఫిర్యాదు చేశారు.

**ఎమ్మెల్యే అనుచరుడి బెదిరింపు**

రాజీనామా చేస్తే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందంటూ రెండు రోజుల క్రితం మెదక్?ఎమ్మెల్యే పద్మాదేవేందర్?రెడ్డికి రామాయంపేటకు చెందిన స్వామి ఫోన్? చేశాడు. ఆదివారం ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు స్వామికి ఫోన్?చేసి బెదిరించారు. సారీ అంటూ వాయిస్? మెసేజ్? పెట్టాలని హెచ్చరించాడు.ఎమ్మెల్యే రాజీనామా చేయాలంటూ ఓటరు డిమాండ్ చేసిన వార్తను 6 న్యూస్ చానెల్, వెలుగు పేపర్ లో రావడంతో మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాజీనామా చేయాలంటూ వస్తున్న వార్తలను ప్రసారం చేస్తున్న 6 న్యూస్ చానెల్ ను బ్యాన్ చేయాలంటూ యూట్యూబ్ లో కొంతమంది టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కామెంట్స్ చేస్తున్నారు.

# టీఆర్ఎస్?తో పొత్తు ఉండదు

-మొదటిపేజీ తరువాయి

పెంచేందుకే చేస్తున్నామని చెప్పారు. మరోవైపు ఓబీసీ చేపట్టిన జనాభా లెక్కల గణాంకాలను బహిరంగ పరచాలని రాహుల్ గాంధీ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఎన్నికలు నిర్వహించిన తర్వాతే.. ఏఐసీసీ ప్రెసిడెంట్ ను ఎన్నుకుందని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తోందని.. ఇతర పార్టీల్లో ఆ ప్రజాస్వామ్యం లేదని ఆయన విమర్శించారు. అవినీతి సొమ్ముతోనే బీజేపీ టీఆర్ఎస్?లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నాయని రాహుల్ ఆరోపించారు. ఇక పొత్తు గురించి ప్రస్తావించిన ఆయన.. టీఆర్ఎస్?తో పొత్తు ఉండదని తేల్చి చెప్పారు. తెలంగాణ సీఎం జాతీయ పార్టీ, అంతర్జాతీయ పార్టీ పెట్టుకోవచ్చన్నారు. అయితే రెండు సిద్ధాంతాల మధ్యే పోటీ జరుగుతోందని ఆయన చెప్పారు. దేశాన్ని విడగొట్టే వాళ్ళు, జోడించే వాళ్ల మధ్యే పోటీ జరుగుతోందన్నారు. విపక్షాల మధ్య ఐక్యత రావాలని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

# మోటర్లకు మీటర్లు ముమ్మాటికీ నిజం

-మొదటిపేజీ తరువాయి

అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మీటర్లపై కేంద్ర ఆర్థికశాఖ.. రాష్ట్రానికి రాసిన లేఖను హరీశ్‌రావు మీడియాకు విడుదల చేశారు. మీటర్లు పెడితే రాష్ట్రానికి ఐదు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.6వేల కోట్ల చొప్పున ఎఫ్ఆర్‌బీఎం కింద అనుమతి ఇస్తుందని కేంద్రం స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, టీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, దేవీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. మోటర్లకు మీటర్ల వ్యవహారంపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఆ క్యాబినెట్ సభ్యుడైన కిషన్‌రెడ్డి తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారన్నారు.

**తలకాయలు ఏడ పెట్టుకొంటరు?**

మోటర్లకు మీటర్ల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ.. రాష్ట్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖలను హరీశ్‌రావు మీడియాకు విడుదల చేశారు. 2021 జూన్ 9న కేంద్రం నుంచి లేఖ వచ్చిందని తెలిపారు. అదే ఏడాది అక్టోబర్ 28న రూరల్ ఎలక్ట్రిఫికేషన్ (ఆర్ఈసీ) మార్గదర్శకాలు విడుదలచేస్తూ లేఖ రాసిందని వెల్లడించారు. ఎఫ్ఆర్‌బీఎం కింద 0.5% జీఎస్డీపీ నిధులు కావాలం టే మోటర్లకు మీటర్లు పెట్టాల్సిందేనని నిబంధన విధించారని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇవ్వవద్దు అని కేంద్రం తన లేఖలో స్పష్టంగా పేర్కొన్నదని వెల్లడించారు. రైతులు తమకు అవసరమైన దానికంటే తక్కు వ విద్యుత్తును వినియోగిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారన్నారు. కరెంటు ఎంత వాడారో తెలుసుకోవాలంటే మీటర్లు పెట్టాలని, ఇందుకు ఒప్పుకొంటే రాష్ట్ర ప్రభుత్వం అండర్‌టేకింగ్ ఇవ్వాలంటూ దాని ప్రొఫార్మా కూడా తయారుచేసి పంపించారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ సర్కారు 65 లక్షల రైతుల మెడకు ఉరితాడు వెయ్యాలని భావించిందని, సీఎం కేసీఆర్ రైతుబిడ్డ కాబట్టి.. మీటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టేది లేదని అసెంబ్లీలోనే కుండబద్దలు కొట్టారని గుర్తుచేశారు. కేంద్రం పంపించిన లేఖలు చూసిన తర్వాత బండి సంజయ్, కిషన్‌రెడ్డి తలకాయలు యాడ పెట్టుకొంటారన్నారు. ఇలాంటి బీజేపీకి మునుగోడు రైతులు కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడుతారని తెలిపారు. మీటర్లు పెట్టేది లేకపోతే.. 30 వేల కోట్లు రాష్ట్రానికి తేవాలని, కనీసం నిరుడు, ఈ ఏడాదికి సంబంధించి 12 వేల కోట్లు తెచ్చి మాట్లాడాలని కిషన్‌రెడ్డికి సవాలు విసిరారు.

విద్యుత్తు మీటర్లపై కేంద్రం రాసిన లేఖలను సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చూపుతున్న మంత్రి హరీశ్‌రావు

**బీజేపీది అబద్ధాల డీఎన్ఏ**

బీజేపీ నేతలు ఒక అబద్ధాన్ని పదేపదే చెప్తూ అదే నిజమని నమ్మించాలని చూస్తున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మునుగోడులో సీఎం కేసీఆర్ సభతో బీజేపీ నేతలకు కంటిమీద కునుకులేకుండా పోయిందని ఎద్దే వా చేశారు. 'బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. వారివి మకిలి మాటలు.. వెకిలి చేష్టలు. అంతులేని అబద్ధాలు ఆడటం బీజేపీ డీఎన్ఏగా మారింది. అందుకే పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీవినీ ఎరుగని రీతిలో చరిత్ర సృష్టించేంత గొప్పగా టీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేసిన మునుగోడు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గల్లీలో ఉండే నాయకుడు కూడా మాట్లాడలేనంత చిల్లరగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడుతున్నారన్నారు. వీళ్ల స్థాయి ఏపాటిదో ఢిల్లీ దూతలు చెప్పారని ఎద్దేవా చేశారు.

# వణికిస్తున్న చలి.. వేగంగా పడిపోతున్న టెంపరేచర్లు

తెలంగాణపై చలి పంజా విసురుతోంది. శీతాకాలం ప్రారంభంలోనే వణుకుపుట్టిస్తోంది. రాబోయే రోజుల్లో చలి మరింత పెరగనుందని వాతావరణశాఖ చెబుతోంది. చలి పెరగడంతో ఉదయం 8, 9 గంటల వరకు ఇంటి నుంచి జనాలు బయటకు రావడం లేదు. రాత్రిపూట యువకులు ఆయా ప్రాంతాల్లో మంట కాచుకుంటున్నారు. అక్టోబరు 20వ తేదీ నుంచి తెలంగాణలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ తీవ్రంగా పడిపోతున్నాయి. ఉదయం వేళల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పొగ మంచు కమ్ముకుంటోంది. సాయంత్రం 6 గంటలు కాకముందే చలి పెరుగుతోంది

# నేటితో మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం పూర్తి

-మొదటిపేజీ తరువాయి



సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగియనున్నదని, 3న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయన సోమవారం బుద్ధభవన్‌లోని ఎన్నికల కార్యాలయం లో మునుగోడు ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మంగళవారం సా యంత్రం 6 గంటల నుంచి సాధారణ ప్రచారంతోపాటు సోషల్ మీడియా ప్రచారంపై కూడా నిషేధం ఉంటుందని చెప్పారు. తనపై ఎలాంటి రాజకీయ ఒ త్తిళ్లు లేవని స్పష్టంచేశారు. బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసుకు ఆయన వివరణ ఇచ్చారనిచెప్పారు.

# 'బండి' బూతులపై భగ్గుమన్న ఉద్యోగులు

'బండి సంజయ్.. నిరాశ, నిస్పృహలతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ ఓ




సైకోలా వ్యవహరిస్తున్నావు. నువ్వు గుట్కాలు తిని జైలుకెళ్తే.. తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర పెత్తందారులను ఎదిరించి మేం జైలుకు వెళ్లినం. నీ తాటాకుచప్పుళ్లకు బెదిరే వాళ్లు ఎవరూ లేరు. తెలంగాణ ఉద్యోగులను అవమానపరిస్తే మంచిగుండదు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులపై చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఉద్యోగులను అవమానించేలా మాట్లాడిన బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలపై ఉద్యోగలోకం భగ్గుమన్నది. ఎంపీ స్థానంలో ఉండీ బూతులు మాట్లాడిన తీరును ముక్తకంఠంతో తప్పుబట్టింది. సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలతో హోరెత్తించారు. సంజయ్ తీరును వ్యతిరేకిస్తూ.. ఉదయం నుంచే నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామంలో కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 'బండి సంజయ్ డౌన్‌డౌన్.. బీజేపీ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. బండి సంజయ్ వెంటనే ఉద్యోగులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని

**నాంపల్లి టీఎన్జీవో భవన్**

ఎదుట ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో జేఏసీ చైర్మన్ మామిండ్ల రాజేందర్, సెక్రటరీ జనరల్ వీ మమత, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి రాయికంటి ప్రతాప్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, రవీందర్‌రావు, గడ్డం జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన ఆగ్రహం**

నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్: టీఎన్జీవో నాయకులపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టరేట్ల వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మెదక్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దొంతు నరేందర్, సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు సుశీల్‌బాబు, సిద్దిపేట జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డి కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. కాగా, మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీఎన్జీవో కార్యాలయం ఎదుట టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పాకాల శ్రీహరి ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి.

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోచయ్య, రాజశేఖర్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ దవాఖాన ఎదుట, ఆదిలాబాద్‌లో కలెక్టరేట్, సహకార కార్యాలయం ఎదుట, నిర్మల్ కలెక్టరేట్‌లో ఉద్యోగులు నిరసన చేపట్టి, బండిసంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. అన్ని శాఖల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. నిజామాబాద్ కలెక్టర్ వద్ద జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కామారెడ్డి కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో బండికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా నాయకులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, రంగారెడ్డి కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తారకేశ్వర్ పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిరసనల్లో అంజద్‌పాషా, రవీందర్, విజయలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీలత, యాదగిరి, రవీందర్, రమేశ్, నర్సింహులు, హేమలత, బంధవి, శివకుమారి పాల్గొన్నారు.

**ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు**

ఉద్యోగుల ఆత్మైస్థైర్యం దెబ్బతినేలా బండి సంజయ్ మాట్లాడారు. గతంలోనూ ఇలానే మాట్లాడినా ఆయన విచక్షణకే వదిలేశాం. ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడితే ఇకపై ఊరుకోబోం. ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగ సంఘాలతో ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉంటుంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ సర్కారు ఉద్యోగులను ఆదుకొంటున్నది. ఉద్యమ కాలంలో వలస పాలకులు ఉద్యోగుల మెడపై కత్తిపెట్టినప్పుడు ఈ బీజేపీ నేతలు ఏమయ్యారు? ఉద్యోగుల శక్తి బీజేపీకి తెలియంది కాదు. ఉద్యోగులతో పెట్టుకున్నవాళ్లకు ఏం జరిగిందో తెలియంది కాదు. ఇన్‌కం ట్యాక్స్ పేరుతో ఒక్కో ఉద్యోగి నుంచి 2 నుంచి 3 నెలల జీతాన్ని లాక్కుంటున్నరు. ఉద్యోగులను ప్రభుత్వానికి దూరం చేసే ఇలాంటి కుట్రలను తిప్పికొడతాం. బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. లేదంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం.

## కేసీఆర్... నాపై ఆరోపణలకు ఆధారాలు ఉంటే చూపించు

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గం సహజంగానే కాంగ్రెస్ కు అడ్డా అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలు తనను ఎంతగానో అభిమానిస్తారని, ఇప్పుడు తాను బీజేపీలో చేరడంతో తనను నమ్మే వాళ్లందరూ కూడా బీజేపీ మద్దతుదారులుగా మారిపోతారని వివరించారు.

# ముదిరాజ్ జర్నలిస్టుల స్వేచ్ఛకు ఐక్యపోరాటాలే మార్గం
# ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలి

**తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు బలరాం,చింతల నీలకంఠం**





ముదిరాజ్ జర్నలిస్టుల స్వేచ్ఛకు ఐక్యపోరాటాలే మార్గమని, అందరు ఐక్యతగా ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బలరాం ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం భౌరంపెట్ బంగారు మైసమ్మ దేవాలయ ఆవరణలో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బలరామ్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్, సీనియర్ పాత్రికేయులు పిట్టల రవీందర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వర్ ముదిరాజ్, జింకల శ్రీనివాస్ ముదిరాజ్, గోనెల కుమారస్వామి,లక్కెడి సాయన్న, హరికుమార్, చింతల శ్రీనివాస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకరబోయిన నాగేశ్వర్ ముదిరాజ్, రాయగిరి ముదిరాజ్ లు ముఖ్య అతిథులుగా హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బలరామ్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్ లు మాట్లాడుతూ... తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా,అన్ని రంగాలలో వెనుకబడిపోయారని వీటన్నిటికీ కారణం ముదిరాజ్ లలో ఐక్యత లేకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం ఏర్పడినప్పటి నుండి ముదిరాజ్ సంఘ నాయకులలో చైతన్యం ఏర్పడుతుందని, దీనికి ప్రతి ముదిరాజ్ జర్నలిస్టు సహకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలని, భారత రాజ్యాంగం కల్పించిన కులాల ప్రతిపాదికన జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్ హక్కుల సాధన కోసం ప్రతిఒక్క ముదిరాజ్ కంకణబద్ధులై కలిసికట్టుగా ముందుకు సాగాలని, ముదిరాజ్ కుల పెద్దలకు,కుల సంఘ నాయకులకు, ముదిరాజ్ జర్నలిస్టులకు, ముదిరాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పరమేశ్వర్ ముదిరాజ్,బోయిని శ్రీనివాస్, పిట్టల.రవీందర్ ముదిరాజ్, నాగేశ్వర్ ముదిరాజ్ లు మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 52 లక్షల మంది జనాభా కలిగిన ముదిరాజ్ లకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. ముదిరాజ్ కుల సంఘాలు నాయకులు విడిపోయి ఐక్యత లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలిపారు. ఇప్పటికైనా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంఖ్యా బలంగా చూసుకుంటే ముదిరాజ్ లు అత్యధిక జనాభా కలిగి ఉండి, రాష్ట్రాన్ని శాసించే స్థాయికి ఎదగొచ్చని, అవకాశం ఉన్న ప్రతి ముదిరాజ్ కులస్తులకు రాజకీయంగా ఎదుగేందుకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ముదిరాజ్ కులంలో వర్గ పోరు కొనసాగుతుందని, అది మంచి పద్ధతి కాదని, ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి అందరు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ముదిరాజ్ హక్కుల సాధన కోసం యావత్ ముదిరాజ్ జాతి ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని కోరారు. నాలుగు స్తంభాలుగా చెప్పుకొని తిరుగుతున్న నాయకులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముదిరాజులు రాణించేలా జర్నలిస్టులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో ముదిరాజులకు ఏ అన్యాయం జరిగినా వారికి అండగా ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం ఉంటుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకు ఇటీవల జరిగిన పరిణామమే నిదర్శనమని ముక్తకంఠంతో తెలియజేశారు. అన్ని కులాలకు ప్రకటించిన విధంగా ముదిరాజ్ లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెంటనే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ముదిరాజ్ కులాలను అడ్డం పెట్టుకొని అధికారాన్ని చలాయిస్తూన్నా ముదిరాజులు వారి స్వలాభం కోసం స్వార్ధ రాజకీయాలు చేస్తున్నారని,కుల అభివృద్ధిని మర్చిపోయి, ముదిరాజ్ కులానికి తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి పద్ధతిని మార్చుకోవవాలని, కుల అభివృద్ధి కోసం పాటుపడాలని ఆ నాయకులకు సూచించారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ముదిరాజులు అన్ని రంగాల్లో ముందుండి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టుల సంఘ నాయకులను సన్మానించి, జ్ఞాపికలను అందజేసిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జర్నలిస్టు మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట 16వ డివిజన్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, జాతీయ ముదిరాజ్ సంఘం నాయకులు కాసాని వీరేశ్ ముదిరాజ్,కోల రవీందర్, గుమ్ముల స్వామి, సారా శంకర్, రాజుల రాజు, సుంకరి సాయి ప్రతాప్, దమ్మని కుమారస్వామి, గుమ్మడి మధుసూదన్, విద్యావేత్త కోల వెంకటేష్, మేడ్చల్ జిల్లా జర్నలిస్ట్ సంఘం నాయకులు బక్కని పాండు, కాసాని రంజిత్, బాన్సువాడ వెంకటేష్, శివ, సతీష్, జెల్ల శివ కుమార్, చంద్ర మోహన్ , బాబు, ఏం.శ్రీధర్, డి. శ్రీధర్ శివ, సాయి, రమేష్, చిరంజీవిలతో పాటు పలువురు ముదిరాజ్ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.



# నూతన తహసిల్దార్ ను కలిసిన టిఆర్ఎస్ సర్పంచ్



సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల నూతన తహసిల్దార్ గా సోమవారం బాధ్యతలను స్వీకరించిన బి. ప్రభులు ను జంబి(కే ) సర్పంచ్ పార్వతి శ్రీకాంత్, ఇటికేపల్లి గ్రామ సర్పంచ్ విట్టమ్మ కిష్టారెడ్డి, టిఆర్ఎస్ మండల యువ నాయకుడు అంజి, మర్యాదపూర్వకంగా కలిసి నూతన తహసిల్దార్ ను కలిసి శాలువాలతో సన్మానించి స్వాగతం పలకడం జరిగింది,

# జాతీయ సమైక్యత దినోత్సవ ప్రతిజ్ఞ

- ఇల్లందు పోలీస్ వారి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించడం జరిగింది.
- జాతీయ సమైక్యతను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించనా పోలీసు వారు.




ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు మండల పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతను గురించి విద్యార్థులకు, ప్రజలకు తెలియపరచడం జరిగింది. ఈ సందర్భంగా ఇల్లందు పోలీస్ వారు మాట్లాడుతూ జాతీయ సమైక్యతలో భాగంగా భారతదేశంలో గల 560 కి పైగా సంస్థానాలన్నీ ఐక్యం చేయడంలో చురుకుగా, కీలక పాత్ర పోషించిన భారతదేశ మొదటి ఉప ప్రధాని అలాగే భారతదేశ ఉక్కుమనిషిగా పిలవబడే సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన ఘనతలు, విజయాల గురించి విద్యార్థులకు తెలియజేస్తూ,వారి చేత సర్దార్ వల్లభాయ్ పటేల్ మహానీయుడిలాగే గొప్ప గొప్ప విజయాలు సాధించాలని ప్రతిజ్ఞలు చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి, సీఐ , ఎస్సైలు మరియు కానిస్టేబుళ్లు పాల్గొనడం జరిగింది.

# మార్టిన్ లూథర్ ప్రొటెస్టంట్ బైబిల్ సంస్కర్త సేవలు మరువలేనివి

- బిషప్ డా దుర్గం ప్రభాకర్
- సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు



సోమవారం : ఈ రోజు సూర్యాపేట పట్టణకేంద్రం లోని శాంతినగర్, బేతెస్థ మినిస్ట్రీస్ తన నివాసం వద్ద బిషప్ డా దుర్గం ప్రభాకర్ సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రొటెస్టంట్ బైబిల్ సంస్కర్త సేవలు మరువలేనిది అనీ,మార్టిన్ లూథర్ (1483 నవంబరు 10 – 1546 ఫిబ్రవరి 18) జెర్మనీకి చెందిన ఒక సన్యాసి,మత ధార్మిక వేత్త, విశ్వవిద్యాలయపు ప్రొఫెసర్, ప్రొటెస్టెంటిజంల కు చెందిన ఒక ఫాదర్, చర్చి సంస్కర్త, ఇతడి ఆలోచనలు ప్రొటెస్టంటు (బైబిల్) సంస్కరణలకు దారితీసి, పశ్చిమ నాగరికతను మార్చివేసాయి. లూథర్ యొక్క ధర్మ శాస్త్రము పోప్ యొక్క ఆధిక్యతను ప్రశ్నించింది, లూథర్ ప్రకారం క్రైస్తవ ధర్మశాస్త్రము బైబిల్ ఆధారంగా మాత్రం పొందగలమని, చర్చిలు, పోపు ద్వారా కాదని ప్రకటించాడు. క్రీస్తుద్వారా బాప్తిజం పొందినవారు మాత్రమే విశ్వవ్యాపిత విశ్వాసులు అని చాటాడు. లూథర్ ప్రకారం, మోక్షము అనునది దైవ ప్రసాదము, దీనిని సత్యవంత 'పశ్చాత్తాపం', యేసు పట్ల విశ్వాసము ఉంచేవారే పొందగలరు. యేసును చేరే మార్గము చర్చిద్వారా మాత్రం కాదు అని చాటిచెప్పాడు. మార్టిన్ లూథర్ అక్టోబర్ 31వ తేది క్రైస్తవ మతంలో ప్రొటెస్టుల సంఘాలకు చాలా ప్రాముఖ్యమైన రోజు 1517లో ఈ దిననా మార్టిన్ లూథర్ తన 95 సిధాంథాలను బహిరంగ చర్చలకోసం అనీ విటెన్ భర్గ్ దేవాలయ తలుపులమీద మేకులతో కొట్టాడు. ఈ సంఘటన క్రైస్తవు లోకంపైనే కాకుండా యావత్ ప్రపంచంపై తన ప్రభావన్నీ చూపింది. ఈ బైబిల్ గ్రంథం ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మందిని ప్రభావితం చేసి విశ్వాసంలోని నడిపించిందని అన్నారు

# కలెక్టర్ కి వినతి పత్రం



హౌస్ బుజుర్గ్ గ్రామంలో డాంబర్ ప్లాంట్ వద్దంటూ గ్రీవెన్స్ రోజున కలెక్టర్కు వినతి పత్రం ఇచ్చారు , గ్రామంలో డాంబర్ ప్లాంట్ వల్ల ఆనారోగ్య సమస్యలు వస్తాయిఅని కలెక్టర్కు సమైక్య యూత్ సభ్యులు విన్నవించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమైక్య యూత్ అధ్యక్షుడు నేరెళ్ల అనిల్ ఉపాధ్యక్షుడు గోపరబోయిన అఖిల్ ,ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మౌలా కోశాధికారి షేక్ సలీం పాషా, మహమ్మద్ ,సయ్యద్ సలీం , షేక్ నిజాం గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# సాహితీ నా జీవితం



గుండెపుడి చైతన్య శర్మ కవిత్వం నేల మీద నడిచే తారక ఓ నిగ్గి లో ఉండే నక్షత్రని ఓ మాటలు మాట్లాడే సిరి మువాఓ నీటిలో పూసే కాలువ పువ్వు ఓ వెన్నెలో వచ్చే చందమామ ఓ వర్షం లో వచ్చే ఇంద్రధనుస్సు ఓ ఉదయాన్నే వచ్చే సూర్య ప్రతిబిబాని ఓ సిరీలను కురిపించే దేవత ఓ నా ఆనందం కోసం వచ్చిన అదృష్టం ని ఓ ని కోట్ల జన్మలను మలిచి ని ప్రేమ ను నాకు ఇచ్చిన ప్రేయసి రాలి ఓ ఆహ్లాదం గా కనిపించే అమ్మాయి ఫేస్ లో రత్నం లాంటి అమ్మాయి గుణములో చిరుజల్లులు లాంటి చిరునవ్వు లో సాహితి ని చూస్తే ప్రపంచం కోటి రత్నాల వీణ ల కనిపిస్తుంది కాను చూపులు ఆశయలుగా చేసి కను రెప్పలు స్వాగతం పలికి తే ఆకాశంలో లో సూర్యుడు లో ని చిరు నవ్వు రూపం లో వచ్చింది నా కలల్ని కవితలుగా చేసి సాహితి ఇస్తున్న కవిత సాగరం గుక్క సాగరాన్ని వడగట్టి మంచి నీరు గా మారుస్తున్న కవిత్వం అంటే నాకు చాలా ఇష్టం గుండెపుడి చైతన్య శర్మ ఫోన్ నెంబర్ 9603871143

# బయ్యారంలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం బయ్యారం రామాలయం సెంటర్లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య మాట్లాడుతూ భారత దేశ 3 వ మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ బడుగు బలహీన వర్గాల కోసం గరిబి హటావో, 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, వంటి ఎన్నో జనరంజక పథకాలని తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకొన్న మహా నేత ఇందిరా గాంధీ గారు అన్నారు. జనరంజక పాలన చేసిన ఘనత ఇందిరాగాంధీ కే దక్కిందని కోరారు ఇందిరా గాంధీ ఆశయ సాధణ కోసం నాయకులు,కార్యకర్తలు పాటు పడి రాహుల్ గాంధీ గారిని భారత ప్రధాని చేయడమే లక్ష ము గా కాంగ్రెస్ పార్టీకోసం పని చేయాలని కోరారు ఈ కార్యక్రమం లో బయ్యారం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి. మండల ప్రధాన కార్యదర్శి గట్ల గణేష్. రామచంద్రాపురం ఎంపీటీసీ భూక్యా లక్ష్మి. మండల మహిళా అధ్యక్షురాలు తగిర నిర్మలా రెడ్డి. ఎస్టి సెల్ మాజీ మండల అధ్యక్షులు గుగులోత్ రాంకోటి. సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుండ్ల వెంకట్నారాయన. జెగ్గుతండా గ్రామ కార్యదర్శి బాను. ఇర్సులాపురం యూత్ కాంగ్రెస్ నాయకులు లాకావత్ మహేష్. బాలాజీపేట గ్రామ శాఖ అధ్యక్షులు కోడి శ్రీనివాస్. బాలజీపేట బూత్ ఎన్రోలర్ బండి యాదగిరి గౌడ్. తిరుమల సుధాకర్ రెడ్డి.రామగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆరున్నర కిలోల గంజాయి పట్టివేత

- ద్విచక్ర వాహనంపై గంజాయి తరలింపు
- అత్యంత చాకచక్యంగా పట్టుకున్న సుజాత నగర్ పోలీస్ సిబ్బంది
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు - డీఎస్పీ వెంకటేశ్వర బాబు

సుజాతనగర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాత నగర్ మండలం పోలీసు వారు ఆరున్నర కేజీల గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. దాని విలువ సుమారు 1,30,000 వరకు ఉంటుందని అంచనా. వివరాల్లోకి వెళితే సోమవారం నాడు సుమారు 8 గంటల సమయములో సుజాతనగర్ ఎస్ఐ తిరుపతి రావు మరియ తన సిబ్బంది తో కలిసి వేపలగడ్డ గ్రామం వద్ద గల రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేయు చుండగా ఒక వక్తి నెంబరు లేని హీరో ప్యాసన్ ప్రో మోటార్ సైకిల్ పై కొత్తగూడెం నుండి ఖమ్మం వైపుకు వెళ్తునాడు. సదరు వ్యక్తిని ఆపి అతని లైసెన్సు మరియు బండి కాగితాలు చూపించమని అడగగా అతడు మోటార్ సైకిల్ని అక్కడే వదిలి పారి పోవు చుండగా పోలీస్ వారు వెంబడించి అతనిని పట్టుకొని విచారించగ అతని పేరు బలరాం చౌదురి అని తండ్రి సుభాష్ చౌదురి వయస్సు: 21 సం:లు కులం: నమసుద్రు కంగురుకొండ, కలిమెల తాలూకా, మల్కనగిరి జిల్లా, ఒరిస్సా రాష్ట్రనికి చెందినవాడు అని చెప్పినాడు. అనంతరం ఆతనిని మరియు మోటార్ సైకిల్ ని చెక్ చేయగా దాని సీట్ కవర్ క్రింద బ్రౌన్ కలర్ ప్లాస్టిక్ టేపుతో నాలుగు పలకలుగా చుట్టబడి 3 ప్యాకెట్లు మరియు మోటార్ సైకిల్ యొక్క పెట్రోల్ ట్యాంక్ కవర్ నందు ఒక గంజాయి ప్యాకెట్ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు . ఇట్టి వాటిని ఇతనికి హైదరాబాదుకు చెందిన ఒక గంజాయి వ్యాపారస్తుడు తీసుకొని రమ్మని చెప్పి ఇతనికి రూ:14,300/- రూపాయలను ఫోన్ పే ద్వారా పంపగా, ఇతను గుర్తుతెలియని వ్యక్తుల వద్ద 6 1/2 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, ఇట్టి గంజాయిని ఇతని అన్నయ్య మోటార్ సైకిల్ పై తన ఊరు నుండి బయలుదేరి హైదరాబాద్ కు తీసుకొని పోవుచుండగా, మార్గ మధ్యలో పోలీస్ వారికి పట్టుబడ్డాడు అని కొత్తగూడెం డిఎస్పి వెంకటేశ్వర బాబు విలేకరుల సమావేశంలో తెలిపారు ఇతనిపై కేసు కేసు నమోదు చేసి ఇతనిని ఈ పనికి ప్రేరేపించిన వాడి కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటినుండి అనునిత్యం పోలీస్ పెట్రోలింగ్ అత్యంత ప్రతిష్టంగా నిర్వహిస్తామని అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించబోమని. గంజాయి లాంటి నిషేధిత వస్తువులకి ఎవరైనా రవాణాకి పాల్పడితే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని. రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు గొడవలలో పాల్గొన్న వ్యక్తి పై కూడా రౌడీషీటర్ ఓపెన్ చేసి పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నేరస్తులు ఎలాంటి అక్రమాలకు పాల్పడడానికి కూడా భయపడతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రమాకాంత్ ఎస్ఐ పి.తిరుపతిరావు ఎస్సై మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెనూ అమలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవు




భద్రాద్రి కొత్తగూడెం (కలెక్టరేట్): టెండర్లు దక్కించుకున్న ప్రకారం నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో ఎస్సి, బిసి, ఎస్టీ, మైనారిటీ శాఖల ఆర్సివోలు, జిల్లా అధికారులు, ప్రిన్సిపాల్స్, కాంట్రాక్టర్లతో వసతి గృహాలకు నిత్యావసర వస్తువులు సరఫరా, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్లో తప్పనిసరిగా ప్రతి రోజు విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలపై మెనూ అమలు చేయాల్సిందిగా ఆదేశించారు. మెనూ అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రోజు వారీ అందించే ఆహారాలను తు.చ. తప్పక అమలు చేయాలని, రోజు వారి మెనూ పై ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే ప్రతి వసతి గృహంలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. టెండర్ ప్రకారం నిత్యావసర వస్తువులు సకాలంలో సరఫరా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. వస్తువులు సరఫరాలో నాణ్యత పాటించాలని చెప్పారు. నిరుపేద వర్గాల పిల్లలకు కార్పోరేట్ విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నదని, విద్యార్థులకు అందించాల్సిన ఆహారంలో లోటు పాట్లు జరిగితే పాపం తగులుతుందని చెప్పారు. నిత్యాసర వస్తువులు సరఫరాలో నాణ్యత పాటించాలని చెప్పారు. సరఫరా చేసిన వస్తువులు రిజిష్టర్లో నమోదులు చేయాలని చెప్పారు. స్టాకు రిజిస్టర్ పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. సరుకులు రవాణాలో జాప్యం చేసే కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఎటువంటి ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేపట్టకుండా బ్లాక్ లిస్టులో పెడతామని ఆయన తెలిపారు. సకాలంలో నిత్యవసర వస్తువులు సరఫరా చేయని కాంట్రాక్టర్లకు సమావేశానికి హాజరుకాని కాంట్రాక్టర్ లకు షోకాజ్ నోటీస్ లు జారీ చేయాలని చెప్పారు. ఆహార పదార్థాలలో నాణ్యత పాటించాలని చెప్పారు. వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఆహారపు తనిఖీ కొరకు జిల్లా అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా నియమించనున్నట్లు ఆయన తెలిపారు. పటిష్ట పర్యవేక్షణ,నిరంతర నిఘా ఉండాలని చెప్పారు. జిల్లా అధికారులు హాస్టళ్లలో మెనూ పరిశీలన చేయడం తో పాటు భోజనాలు చేయాలని చెప్పారు. అధికారులు తనిఖీ తో పాటు ఆహార పదార్థాలలోపాటించు మెనూ అమలుపై నివేదికలు అంద చేయాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఏదైనా కంప్లైంట్ వచ్చినట్లయితే కఠిన చర్యలు తప్పవని అయన హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్సివోలు, జిల్లా అధికారులు, ప్రిన్సిపాల్స్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు నిందితులపై పీడియాక్టును నమోదు చేసిన పోలీసులు

గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఒకరిపై మరియు మావోయిస్ట్ పార్టీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మరొకరిపై పీడీ యాక్ట్ నమోదు జిల్లా కలెక్టర్ గారి ఉత్తర్వులతో ఎస్పీ డా.వినీత్.జి ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు,భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ ఐపిఎస్ గారి సూచనలతో భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలుమార్లు గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన మిర్యాలగూడ కు చెందిన దారావత్ రమణపై,మావోయిస్ట్ పార్టీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పినపాక మండలానికి చెందిన భగతు వెంకన్న లపై పీడీయాక్ట్ నమోదు చేయడం జరిగిందని భద్రాచలం సిఐ నాగరాజు రెడ్డి తెలియజేసారు.వారిని అరెస్టు చేసి అనంతరం చర్లపల్లి సెంట్రల్ జైలు,హైదరాబాద్ నకు తరలించడం జరిగిందని భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి వెల్లడించారు.

## జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు





**సుజాతనగర్**: పోరాటం ఆయన రక్తంలో ఉంది. విజయం ఆయన అడుగుల్లోనే ఉంది. వల్లభాయ్ పటేల్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముఖ్య నాయకుల్లో ఒకరు. బ్రిటీషర్లు భారత్‌ను విడిచి వెళ్లాక దేశ రక్షణ, సమగ్రత కోసం ఆయన ఎంతో కృషి చేశారు. పటేల్ అందరు నేతల్లా ఒకరి ఆదేశాల ప్రకారం నడుచుకునే వ్యక్తి కాదు. అందుకే ఆయనకు "ఉక్కుమనిషి" అనే గుర్తింపు వచ్చింది. .స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశానికి మొట్టమొదటి హోంమంత్రిగా సేవలందించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా సుజాతనగర్ మండలంలోని పోలీసు, రెవెన్యూ శాఖ తో పాటు వివిధ అధికారులు అతనికి నివాళులు అర్పించారు. 1875, అక్టోబర్ 31న జన్మించిన అతని జయంతిని "జాతీయ ఐక్యత దినోత్సవం" గా ప్రకటించుకుంటూ భారతదేశంలోని ప్రతి పౌరులు ఐక్యతతో మెలగాలని ప్రతిజ్ఞ చేశారు. "దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, అంతేగాక, ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషి చేస్తానని సత్యనిష్టతో ప్రతిజ్ఞ చేస్తున్నాను. సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క దార్శనికత, చర్యల వల్ల లభ్యమైన నా దేశ ఏకీకరణ స్ఫూర్తితో నేను ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను. అంతేగాక, నా దేశ అంతర్గత భద్రతను పటిష్టపరచడానికి స్వీయ తోడ్పాటునందిస్తానని సత్యనిష్టతో తీర్మానం చేస్తున్నాను" అంటూ సాగిన ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో సుజాతనగర్ స్టేషన్ సీఐ రమాకాంత్, ఎస్ఐ తిరుపతిరావు, మండల తహసిల్దార్ సునీల్ కుమార్ రెడ్డి తో పాటు పోలీసు సిబ్బంది మరికొంతమంది అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 2015 ముందు ఆధార్ కార్డు పొంది ఉంటే వెంటనే అప్డేట్ చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు కలెక్టర్ గారు విజ్ఞప్తి చేశారు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ గారు అనుదీప్ దురిశెట్టి ప్రకటన లో 2015 ముందు ఆధార్ కార్డు పొంది ఉంటే కార్డును వెంటనే అప్డేట్ చేసుకొని ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను పొందాలని ప్రజలకు సూచించారు జిల్లా ప్రజలు ఏ సంక్షేమ పథకాలు పొందాలన్నా ఆధార్ కార్డుతో అనుసంధానంగా ఉంది కాబట్టి తొందరగా అప్డేట్ చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గారు అన్నారు

## మీసేవ ధరణి సెంటర్ నిర్వాహకులకు పలు సూచనలు చేసిన తాసిల్దార్

**సంగారెడ్డి జిల్లా** :రాయికోడ్ మండల తహసిల్దార్ గా సోమవారం బాధ్యతలు చేపట్టి బి.ప్రభువులు మీసేవ. ధరణి సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ సమావేశంలో మీసేవ ధరణి సెంటర్ల నిర్వాహకులు పలు సూచనలు చేస్తూ తన సంతకం లేనిదే ఎటువంటి రిజిస్ట్రేషన్లు పట్టా మార్పు ఇతర లావాదేవీలు చేయరాదని, ఎవరైనా అక్రమంగా ఇలా చేస్తే షాప్ ను సిజ్ చేసి పలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు, అందరం ఫ్రెండ్లీగా ఉంటూ రైతులకుఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా చూడాలని తహసిల్దార్ కోరారు.

## పందుల పెంపకందారులకు నోటీసులు జారీ



గ్రేటర్ పరిధి 66 డివిజన్ హసన్ పర్తిలో జనావాసం ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పెంచుతున్న పందుల పెంపకాన్ని నివారించాలని గ్రీవెన్స్ ఫిర్యాదుల మేరకు మన గ్రామ పంచాయతీ వద్ద సమావేశం జరిగింది. గ్రీవెన్స్ కంప్లైంట్ ఉద్దేశించి మీటింగ్ ఏర్పాటు చేసిన సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ డి.భాషానాయక్ మాట్లాడుతూ పందులు పెంచే వారికి రెండు రోజుల వ్యవధిలో పందులు పట్టుకోమని ఆదేశించారు. ఈ సందర్భంగా పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేశారు. పందులు పట్టని ఎడల తర్వాత కార్పొరేషన్ తీసుకునే చర్యలకు మీరే బాధ్యులు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో జవాన్లు బికపతి, సుజాత, పందుల పెంపకందారులు పాల్గొన్నారు.

## ఘనంగా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడి జన్మదిన వేడుక



టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఢీకొండా బిక్షపతి జన్మదిన వేడుకను 66వ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ మరియు పార్టీ సీనియర్ నాయకులు,యూత్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, కుల సభ్యులు పాల్గొని బిక్షపతి కి శుభాకాంక్షలు తెలిపారు

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు





కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో, సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో, మాజీ ఎమ్మెల్యే గంగారం పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొని, స్వాతంత్రం కొరకు ఎంతో కృషి చేశారని వారు అన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో కీలకపాత్ర వహించరని వారు కొనియాడారు. భారతదేశానికి తొలి ఉప ప్రధానిగా ఎన్నికై సేవలందించి దేశానికి ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి గొప్ప పరిపాలన విధానాన్ని అమలుపరిచారని వారు అన్నారు. అనంతరం భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారం పాల్గొని, ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ పరిపాలనలో దేశ ప్రజలకు గొప్ప పరిపాలన విశిష్ట సేవలందించిందని వారు అన్నారు .కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంబీగే హనుమాన్లు, మాజీ సర్పంచ్ హనుమ గంగారం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రాజు, మండల యూత్ అధ్యక్షులు ప్రవీణ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహ చారి ,నజీర్ సెట్, మెగావత్ రవి, తుకారం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, బుర్రెం బాలరాజ్, మోహిన్, మహమ్మ ద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమక్యత స్ఫూర్తిని చాటిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్....





- న్యూ ఇండియా పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జనగామ తిరుపతి...
- ఖనిలో ఘనంగ జాతీయ సమైక్యత దినోత్సవం...

భారతదేశ తొలి హోం మంత్రి గా పనిచేసి ఏక ఖండంగా తీర్చిదిద్ది, జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని న్యూఇండియాపార్టీ తెలంగాణరాష్ట్ర కన్వీనర్ జనగామ తిరుపతి అన్నారు. సర్దార్ వల్లభాయ్ జయంతి సందర్భంగా సోమవారం గోదావరిఖని పట్టణంలోనీ కార్యాలయంలో న్యూ ఇండియాపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సమైక్యత దినోత్సవం కు హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. స్వతంత్ర పోరాటంలో పాల్గొనీ ఆదర్శమూర్తిగా ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ తొలి హోం మంత్రిగా పనిచేసి ఏక ఖండంగా తీర్చిదిద్ది, జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటినట్లు తెలిపారు. నిజాం నవాబుల మెడలు వంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించిన ధీరుడు అని అన్నారు. దేశంలో 550 పైగా ఉన్న సంస్తానాలను విలీనము చేసిన ఉక్కుమనిషి సర్దార్ పటేల్ అని కొనియాడారు. వారిని అందరు స్ఫూర్తిగా తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూ ఇండియా పార్టీ నాయకులు డా.జె వి రాజు, వేముల అశోక్, గంటా బబితసోని , జనగామ తిరుపతి, వానమామలై రామాచారి , ఎటూరి శ్రావణ్ , నందం నాగవర్ధన్ రావు, నగునూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో దానం పేదవారికి ప్రాణం

- దయా గుణం చాటుకున్న కాకతీయ స్కూల్ కరస్పాండెంట్.
- 15 వేల రూపాయలను మదర్ థెరిసా సేవా సంస్థకు విరాళంగా అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు మండలంలో గల కాకతీయ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దండు రామచందర్ 15 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా మదర్ థెరిసా సేవా సంస్థకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ స్కూల్ కరెస్పాండెంట్ , ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మదర్ తెరిసా ఫౌండేషన్ లో అనేక రకాల అనాథ పిల్లలు మరియు అంగవైకల్యం కలిగిన పిల్లలు ఉండటం జరుగుతుందని వారి యొక్క ఆహార ఆరోగ్య సదుపాయాల కోసం మా వంతు సహాయంగా కాకతీయ స్కూల్, పిల్లలు కరస్పాండెంట్ తరపునుంచి 15000 రూపాయలు ఆర్థిక విరాళం అందజేశామని తెలిపారు.అలాగే ప్రతి ఒక్కరు కూడా సేవగునాన్ని కలిగించుకోనీ మీ సహాయంగా మదర్ థెరిసా ఫౌండేషన్ కు అందజేయాలని పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు కాకతీయ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దండు రామచందర్ తెలియపరచడం జరిగింది.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com